క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ భగత్‌సింగ్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ రాజీవ్ స్వగృహ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆవాస్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ నాగమణి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ నాగమణి, అధికారులు

మీర్‌పేట: అర్హులైన పేద ప్రజలు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగమణి అన్నారు. గురువారం మీర్‌పేటలో అంగీకార్–2025 (పీఎంఏవై అర్బన్)–2.5 అవగాహన ర్యాలీని కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు సొంతింటి కళను సాకారం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సిటిజన్ సర్వే నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి విన్నవిస్తున్న గిరిజనులు

పహాడీషరీఫ్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి రంగ నాయకుల కాలనీలో స్థలం కేటాయించాలని మాజీ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్‌యాదవ్ కోరారు. ఈ మేరకు గిరిజన ప్రతినిధులతో కలిసి గురువారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లో గిరిజనులు పెద్దసంఖ్యలో ఉన్నారని, ఉత్సవాలు నిర్వహించుకునేందుకు సేవాలాల్ నిర్మాణం చేసుకుంటామని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించేలా చూస్తానని ఈ సందర్భంగా ఆమె వారికి హామీనిచ్చారు. ఆమెను కలిసిన వారిలో ఇస్లావత్ శ్రీనునాయక్, నేనావత్ రవి నాయక్, జటావత్ ప్రసాద్, సోమ్లీ, రుక్కి, శివ, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మహేశ్వరం: మహేశ్వరం బీఆర్‌ఎస్ మండల యువ నాయకుడు ఆకుల వీరుబాబు తండ్రి ఆకుల లక్ష్మయ్య(హోటల్ లక్ష్మయ్య) మరణించడంతో ఆయన భౌతికాయానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి గురువారం పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. లక్ష్మయ్య అకాల మరణం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకుంటున్నామని తెలిపారు. అనంతరం వారి కుమారులు వీరుబాబు, శివకుమార్, భార్య, కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో నాయకులు కర్రోళ్ల చంద్రయ్య, శివగంగ ఆలయ మాజీ చైర్మన్లు మునగపాటి నవీన్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, దయ్యాల శ్రీనివాస్, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు

హస్తినాపురం: ఈ నెల 18న జరగనున్న బీసీ బంద్‌కు రాజ్యాంగ పరిరక్షణ వేదిక, తెలంగాణ ఎంఆర్‌పీఎస్ బీసీ జేఏసీ సంస్థలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం హస్తినాపురం చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు బీసీలకు మరణశాసనంగా మారాయని, వాటినే వెంటనే రద్దు చేయాలన్నారు. శాసనసభ, పార్లమెంట్‌లో బీసీలకు రిజర్వేషన్లు లేకుండా కేవలం స్థానిక సంస్థలలో మాత్రమే ఇవ్వడం అన్యాయమని చెన్నోజు శ్రీనివాసులు అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో రిజర్వేషన్ వ్యతిరేక పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థికి మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

శిథిలావస్థకు చౌడి భవనం!

ప్రమాదకరంగా మారిన వైనం

- పట్టించుకోని అధికార యంత్రాంగం



సరూర్‌నగర్ చౌడి భవనం

హుడాకాంప్లెక్స్: మరమ్మతులకు నోచుకోక సరూర్‌నగర్‌లోని చౌడి(చౌరస్తా) భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా, ఇరుకుగా మారిన ఈ పురాతన భవనానికి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మరోవైపు ఈ భవనం స్థానంలో జంక్షన్ పార్కు కానీ, 'ఐ లవ్ సరూర్‌నగర్, మై చౌడి' అని నామకరణమో చేయాల్సిందిగా కొంతమంది స్థానికులు వినతిపత్రాలు అందజేసినా అధికారుల నుంచి స్పందన లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

70 ఏళ్ల క్రితం నిర్మాణం

సరూర్‌నగర్ మహాత్మా గాంధీ విగ్రహం నుంచి గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో చౌడి భవనం ఉంది. 70 ఏళ్ల క్రితం నిర్మించారు. మొదట్లో పోలీస్ ఔట్ పోస్టు కోసం, ఆ తర్వాత ఆస్పత్రి కోసం వినియోగించారు. ఆ తర్వాత 30 ఏళ్లపాటుగ్రామ పంచాయతీ భవనం కోసం, జీహెచ్‌ఎంసీలో ఈ ప్రాంతం విలీనమైన తర్వాత వార్డు కార్యాలయం కోసం వినియోగించారు. ఇటీవల వరకు ఒంటరి మహిళల కోసం నైట్ షెల్టర్‌గా వినియోగించారు. ఇక్కడ 24 మంది మహిళలు వసతి పొందారు. జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు కేటాయించకపోవడంతో ఇటీవల ఈ భవనాన్ని ఖాళీ చేయించారు.

రద్దీగా మారిన చౌరస్తా

సుమారు 500 గజాల విస్తీర్ణంలో రోడ్డు మధ్యలో ఈ భవనం విస్తరించి ఉంది. దీనికి ఇరువైపులా ఉన్న రోడ్ల వెంట భారీ భవంతులు వెలిశాయి. వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా మారుతోంది. ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని అయోమయ పరిస్థితి. ప్రమాదకంగా మారిన ఈ భవనాన్ని కూల్చి వేయాల్సిందిగా ఇప్పటికే పలువురు స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినా.. ఇప్పటి వరకు అటు వైపు దృష్టి సారించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

> **మరమ్మతులు చేయాలి**
>
> 
>
> పురాతన కట్టడాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. శిథిలావస్థకు చేరిన ఈ భవనానికి మరమ్మతులు చేయాలి. ప్రజా అవసరాల కోసం వినియోగించాలి. భవనం చుట్టూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలి.
>
> – మహేందర్‌యాదవ్, సరూర్‌నగర్

కందుకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి



కందుకూరులో నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కందుకూరు: కందుకూరు లయన్స్‌క్లబ్ 19వ అధ్యక్షుడిగా సురసాని విఠల్‌రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు కార్యదర్శిగా తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా కె.వెంకటేశ్వర్లుగుప్తా, మొదటి ఉపాధ్యక్షుడిగా జి.చెన్నకిషన్‌రెడ్డి, ప్రజా సంబంధాల అధికారిగా డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా బి.రాంరెడ్డి, జీఎస్టీ కో–ఆర్డినేటర్‌గా సురసాని వెంకట్‌రంగారెడ్డి, జీఎంటీ కో–ఆర్డినేటర్‌గా తాళ్ల అంజయ్య, ఫ్యామిలీ ఉమెన్ కో–ఆర్డినేటర్‌గా జి.దీపారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శ్రీధర్, టిమర్‌గా లయన్ టంకరి కేశవరెడ్డి, టెయిల్ ట్విస్టర్‌గా గంట రాంరెడ్డి, క్లబ్ గడ్ డైరెక్టర్లుగా ఏనుగు జంగారెడ్డి, ఐనవోలు రాంగోపాల్‌రెడ్డి, డాక్టర్ సత్తు ధర్మేందర్‌రెడ్డి, బి.కొండల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. వారందరితో బుధవారం రాత్రి కందుకూరులో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తన సొంత క్లబ్ ఇన్‌స్టాలేషన్‌లో ముఖ్య అతిథిగా రావడం గర్వకారణంగా ఉందన్నారు. తన గెలుపు కోసం పాటుపడిన ప్రతి క్లబ్ సభ్యునికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా క్యాబినేట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, జిల్లా క్యాబినేట్ కోశాధికారి బీఆర్ రాంరెడ్డి, రీజియన్ చైర్మన్ ఎస్.జనార్దన్‌రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరు లింగయ్య, ఆమనగల్లు క్లబ్ సభ్యులు జూలూరి రమేశ్, గంప శ్రీనివాస్‌గుప్తా, గుండ్ర సుధాకర్‌రెడ్డి, టంకరి యాదగిరిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సరికొండ పాండు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురంలోని రైతుబజారులలో కూరగాయల ధరలు.. టమాట రూ.23, వంకాయ 40, బెండ 35, పచ్చిమిర్చి 35, కాకర 30, బీర 38, క్యాబేజీ 23, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 45, దొండ 23, చిక్కుడు 75, గోకర 45, బీట్‌రూట్ 40, క్యాప్సికం 60, ఆలు 23, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 18, చామగడ్డ 23.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

ఎల్‌బీనగర్: నిత్యం వేల సంఖ్యల్లో రాకపోకలు సాగించే రహదారుల్లో డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని సీపీఎం పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలో సీపీఎం ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డితో పాటు పలువురు నాయకులు సామానగర్, వెంకటేశ్వరకాలనీ, ముదిరాజ్‌కాలనీ, హయత్‌నగర్, భాగ్యలత, ఇంజాపూర్ వెళ్లే కాలనీలో పర్యటించారు. ఈ రహదారులపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం అవసరాలకు వెళ్తుంటారని ఇలాంటి రోడ్లపై నిత్యం డ్రైనేజీ పారడం పట్ల అధికారుల తీరుపై మండిపడ్డారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు.

దేవాలయ భూమిని కాపాడుకుంటాం



హనుమంతుడికి పూజలు చేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కుర్మల్‌గూడలో హనుమాన్ దేవాలయానికి కేటాయించిన భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని కుర్మల్‌గూడలో సర్వేనెంబర్ 56, 57లో ఏర్పాటైన వెంచర్‌లో 1025 గజాలు హనుమాన్ దేవాలయానికి కేటాయించారు. ఈ సందర్భంగా హనుమాన్ విగ్రహానికి నేతలు పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి మాట్లాడుతూ.. భూ కబ్జాదారులు దేవాలయానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు చూస్తున్నారన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి బై నంబర్లతో అమ్మే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దేవాలయానికి కేటాయించిన స్థలాన్ని కాపాడుకుంటామన్నారు. హిందూమత పెద్దలతో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలమణి బాబు, ఆలయ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎడ్ల శ్రీశైలం, అశోక్‌గౌడ్, శంకరయ్య, భాస్కర్, ఎడ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

బీసీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

ఎల్‌బీనగర్: తెలంగాణ రాష్ట్ర బీసీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి కృష్ణ అధ్యక్షతన గురువారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన సమావేశంలో సంస్థ కార్యకలాపాలు, బీసీ న్యాయవాదుల అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు సంఘం మద్దతు వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో గట్టిపంపుల బాబురావు, బొమ్మ వెంకటేశ్, పాండలై నర్సింహా, శివరాజు, రవికుమార్ యాదవ్, కల్లరమేశ్, జాయింట్ సెక్రటరీలు రాజేశ్వర్, బ్రహ్మచారి,అంజయ్యగౌడ్ పాల్గొన్నారు. బీసీ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం రాజ్యాంగ సవరణలు చేపట్టి, బీసీ వర్గాల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు.

'సదర్'కు నిధులు మంజూరు చేయాలి

యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో సదర్ ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని యాదవ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సదర్ పండుగను అధికారికంగా గుర్తించడం హర్షణీయమన్నారు. యాదవ సమాజం ఈ నెల 19న ఇందిరా పార్కువద్ద ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సదర్ ఉత్సవాలను బోనాలు, బతుకమ్మ పండగల తరహాలో నిర్వహించాలన్నారు. ఉత్సవ నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలని, వేడుకలకు ప్రభుత్వం రూ.10కోట్లను మంజూరు చేయాలన్నారు. ఉత్సవ వేదికలను ఏర్పాటు చేసేందుకు యాదవ సంఘాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు, ఊరేగింపులకు రూ.3లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాస్థాయిలో ఉత్సవాల నిర్వహణ బాధ్యత కలెక్టర్లకు ఇవ్వాలని కోరారు. యాదవ సంఘాల నాయకులందరూ ఏకతాటిపైకి వచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు అంజన్‌కుమార్‌యాదవ్, తిరుమలేశ్‌యాదవ్, చెన్నకేశవులుయాదవ్, సాయికుమార్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన



విద్యార్థులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని సిరిగిరిపురంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి గురువారం సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను ఆమె విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మహేశ్వరం–సిరిగిరిపురం రోడ్డుకు ఇరువైపులా గ్రామానికి చెందిన రైతులు సీతాఫలాలు అమ్ముతున్న వారి వద్దకు వెళ్లి సరదాగా మాట్లాడి పండ్లు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, నాయకులు అదిల్, ప్రభాకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ



పోషణమాసంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు

మహేశ్వరం: పోషకాహారంతోనే ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని మోహబ్బత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. మాతాశిశు ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మైత్రి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను తెలియజేయడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై వినతులు అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. సాధ్యమైనంత వరకు అధికారులు తమ పరిమితికి లోబడి సమస్యలను పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి



బీసీ సంఘం నాయకులతో వివిధ పార్టీల నాయకులు

కందుకూరు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం ఈ నెల 18వ తేదీన బీసీ సంఘాల ఆ.ధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య, మండల అధ్యక్షుడు బండ ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో బీసీ నాయకులతో పాటు వివిధ పార్టీల అధ్యక్షుల తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో అన్ని సంఘాలు ఏకతాటిపైకి వచ్చి చేపట్టనున్న బంద్‌ను మండలంలో జయప్రదం చేయాలన్నారు. అందుకు అన్ని గ్రామాల్లో బీసీలు స్వచ్ఛందంగా ముందుకు రావా లన్నారు. కాగా బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం, డీఎస్పీల మండల అధ్యక్షులు నిమ్మ అంజిరెడ్డి, మన్నే జయేందర్‌ముదిరాజ్, బుట్టి బాల్‌రాజ్, చిన్నగళ్ల ఆంజనేయులు పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు దేరంగుల శ్రీరాములు, కురుమ సంఘం నాయకులు గౌర ప్రభాకర్, గౌడ సంఘం నాయకులు రమేశ్‌గౌడ్, రవిగౌడ్, రజక సంఘం అధ్యక్షుడు ఏ.శ్రీనివాస్, సరికొండ మల్లేశ్, కుమ్మరి నర్సింహ, కత్తుల దేవేందర్‌గౌడ్, మల్లేశ్, ముత్యాలు, మోటె రమేశ్, ఐ.సురేశ్‌గౌడ్, అమరేందర్, డి.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ 27వ డివిజన్‌లో చిలివేరు ప్రసన్నజ్యోతి శివకుమార్‌కు ఇల్లు మంజూరుకాగా నిర్మాణం పూర్తిచేసింది. గురువారం గృహ ప్రవేశానికి కమిషనర్ పి.సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్‌కు కేటాయించిన ఇళ్ల లబ్ధిదారుల్లో ప్రసన్నజ్యోతి ఇల్లు మొదటిగా పూర్తయిందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ మర్రి హనుమంతరావు, యూత్ నాయకులు సుభాన్‌యాదవ్ తదితరులు లబ్ధిదారుని ఇంటికి చేరుకొని దంపతులను ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్ యోగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టల్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ యోగేశ్, విద్యుత్‌శాఖ ఏఈ ప్రదీప్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో గతంలో వేసిన డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున పెద్దఎత్తున దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాత లైన్‌ని తొలగించి కొత్తలైన్ వేయాలని, సీసీరోడ్లు, పిచ్చిమొక్కల తొలగింపు, కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌ను కోరారు. అదేవిధంగా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీవాసుల సమస్యలపై ఇరువురు అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు విఠలయ్య, ప్రతాప్‌రెడ్డి, అశోక్, వరకుమార్, ప్రశాంత్, శ్రీశైలం, లీల ప్రసాద్, రాంచంద్రయ్య, విఠల్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె



ఇంటింటి సర్వే చేపడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల్లో ప్రజలు వందశాతం అక్షరాస్యత సాధించినప్పుడే పల్లెలు అభివృద్ధి చెందుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనంలో గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ్ జహాన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతాకాల శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అక్షరాస్యత, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటి సర్వేను నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ శిబిరానికి ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఆహారంలో ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పులు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రజలందరూ అక్షరాస్యతను సాధించేందుకు కృషి చేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ముంతాజ్, అధ్యాపకులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.